క్లుప్తంగా

లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు నేరం

వైద్యాధికారి ఉదయ్ కిరణ్

నర్మెట/తరిగొప్పుల: లింగనిర్ధారణ, భ్రూణ హత్యలు చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడిన వారికి రూ. 50వేల జరిమాన, ఐదేళ్ల జైలు శిక్ష ఉంటుందని మండల వైద్యాధికారి ఉదయ్ కిరణ్ అన్నారు. ఉమ్మడి మండలాల పరిధిలో గత ఏడాది సెప్టెంబర్ నుంచి డిసెంబర్ కాలంలో ఐదుగురు గర్భిణులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సమీప స్కానింగ్ కేంద్రాల్లో స్కానింగ్‌లు నిర్వహించుకుని భ్రూణ హత్యల (అబార్షన్ల)కు పాల్పడినట్లు దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించడం సైతం నేరమని పీసీపీఎన్‌డీటీ-1994 చట్టరీత్యా శిక్షలు తప్పవని హెచ్చరించారు. వైద్యులు, ఆర్‌ఎంపీలు, స్కానింగ్ సెంటర్ యజమానులు విషయాలను గమనించాలని సూచించారు.

'పచ్చపార్టీ కుట్రలు ఎండగడదాం'



కొబ్బరికాయ కొడుతున్న ప్రవీణ్‌కుమార్

బచ్చన్నపేట: ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీర్తిప్రతిష్ఠలను ఓర్వలేక పచ్చపార్టీ నాయకులు అనేక కుట్రలు చేస్తున్నారని, వాటిని త్వరలోనే ఎండగడతామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు బొడ్డు ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం ఏపీలోని కనకదుర్గమ్మ ఆలయంలో ఆయన 101 కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాక్షి దినపత్రికలో.. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చేస్తున్న అవినీతిని బయటపెడుతుంటే కక్షతో పేపర్‌కు సంకెళ్లు వేయాలని చూస్తున్నారని అన్నారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో అక్రమంగా సోదాలు నిర్వహించడం సరికాదన్నారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

ప్రకృతి సంపదను ధ్వంసం చేయొద్దు



దేవరుప్పుల: కడవెండి రెవెన్యూ పరిధిని ఆనుకొని ఉన్న లక్ష్మీనర్సింహస్వామి వానకొండయ్య గుట్ట ప్రకృతి సంపదను ధ్వంసం చేయొద్దని లకావత్‌తండావాసులు విజ్ఞప్తి చేశారు. ఇటీవల గుట్టపై మైనింగ్(క్వారీ) పనులను ప్రారంభించేందుకు వచ్చిన తరుణంలో తండావాసులు నిరాకరించడమే కాకుండా కలెక్టర్‌కు ప్రజావాణిలో మొరపెట్టుకున్నారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ గురువారం మైనింగ్ అధికారులను గుట్టపై తలపెట్టిన క్వారీ ప్రదేశాన్ని పున:పరిశీలనకు పంపించారు. ఈ సందర్భంగా లకావత్ తండా మాజీ సర్పంచ్‌లు కవిత, లలిత, బీఆర్‌ఎస్ నాయకురాలు లకావత్ రాజేశ్వరి, సోమన్న, మోహన్ తదితరులు గుట్ట పక్కకే ఉన్న గ్రామ మౌలిక వసతులు కనుమరుగవ్వడమే కాకుండా మా ప్రాంతంలో పర్యావరణం దెబ్బతింటుందని మొరపెట్టుకున్నారు. ఈ విషయమై క్షేత్ర పరిశీలన చేసిన మైనింగ్ అధికారి అనిత ఇక్కడి వాస్తవ పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నట్లు తండావాసులు తెలిపారు.

వృద్ధురాలిపై దాడి..

3 తులాల బంగారు గొలుసు అపహరణ

జనగామ: పట్టణంలోని గిర్నిగడ్డలో ఓ వృద్ధురాలిపై దాడి చేసి మూడు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన సంఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గుండ్లగడ్డకు చెందిన వృద్ధురాలు పబ్బోజు ప్రమీళ వృద్ధురాలు ఇంట్లో ఒక్కరే ఉంటారు. చుట్టుపక్కల వారు ఎవరూ లేని సమయంలో బుధవారం ఇంట్లో చొరబడిన వ్యక్తి.. ప్రమీళపై దాడి చేసి మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. దీంతో వృద్ధురాలికి గాయాలు కాగా, సమీప వాసుల సమాచారం మేరకు ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని విచారణ ప్రారంభించారు. వృద్ధురాలి మనువళ్లు వచ్చి ఆమెను వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తరలించారు. గుండ్లగడ్డ జంక్షన్ మూడు రోడ్ల కూడలి సమీపంలో పట్టపగలే దుండగులు ఇంట్లో చొరబడి వృద్ధురాలిపై దాడి చేసి చోరీ చేయడంతో పట్టణంలో ఆందోళన నెలకొంది. పోలీసులు రాత్రి, పగలు అన్ని వార్డుల్లో గస్తీ పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

కారుణ్య నియామకం

కేయూ క్యాంపస్: యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో స్టోర్‌కీపర్‌గా ఉద్యోగం చేస్తూ గతేడాది డిసెంబర్ 31న నర్మెట్ట అయిలయ్య మరణించారు. ఆయన భార్య గోవిందు స్వప్న కుమారికి కారుణ్య నియామకం కింద కామాటిగా నియమిస్తూ కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు స్వప్నకుమారికి వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం గురువారం నియామక ఉత్తర్వులు అందజేశారు.

ఇరుకు భవనంలో కార్యాలయం



ఎంపీడీఓ కార్యాలయం



ఇరుకుగా ఉన్న వరండాలో పనులు చేస్తున్న సిబ్బంది



ఎంపీడీఓ గది

- ఒకే గదిలో మూడు శాఖలు
- ఇబ్బంది పడుతున్న సిబ్బంది, ప్రజలు

చిల్పూరు: 17 గ్రామ పంచాయతీలకు అనుసంధానంగా ఉన్న మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ భవనం ఇరుకుగా ఉండడంతో సిబ్బందితోపాటు పనుల కోసం వచ్చే వారు ఇబ్బంది పడుతున్నారు. నూతన మండలంగా ఏర్పడిన నాటి నుంచి జీపీకి సంబంధించిన భవనంలో ఎంపీడీఓ కార్యాలయం కొనసాగుతోంది. అందులో ఒక హాలు, రెండు చిన్నగదులుండగా గతంలో ఎంపీపీ ఒకగదిని వినియోగించుకోగా, ఉపాధిహామీ సిబ్బంది మరోగదిలో ఉన్నారు. హాలులో కొంత భాగం ఫైబర్ నెట్ వారికి సంబంధించిన పరికరాలు బిగించుకోవడంతో హాలు చిన్నదైంది. ఫైబర్ నెట్ పరికరాలు భద్రపరిచే చోటే కుర్చీ పట్టేంత స్థలం ఉండడంతో ఎంపీడీఓకు కేటాయించారు. దీంతో ఇబ్బందుల నడుమ విధులను నిర్వహిస్తున్నారు. కాగా, పనుల కోసం వచ్చే వారు ఆరుబయటనే ఉండాల్సి వస్తోంది. దీనికి తోడు ఇటీవల హౌసింగ్ బోర్డువారు కూడా ఇందులోనే మకాం వేయడంతో సిబ్బంది కుర్చీలతోనే హాలు నిండిపోయింది. ఇక సమావేశాలు నిర్వహించుకోవాలంటే ప్రత్యామ్నాయం చూసుకోవాల్సిన పరిస్థితి.

ఏళ్లు గడుస్తున్నా పక్కా భవనాలు నిర్మించరా..



మండలాలు ఏర్పడి ఏళ్లుగడుస్తున్నా కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించరా. వివిధ పనులపై వచ్చే వారు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించాలి.

– మాచర్ల ప్రవీణ్, స్థానికుడు

ఎంపీడీఓకు ప్రత్యేక గది కేటాయించాలి..



కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారికి ప్రత్యేకంగా గది కేటాయించాలి. పనులపై వెళ్లే వారు నిలబడాల్సి వస్తోంది. అధికారులు స్పందించాలి.

– జంగిటి కుమార్, రైతు

భవన నిర్మాణాలకు స్థల సేకరణ చేపడుతున్నాం..



కార్యాలయం ఇరుకుగా ఉండడంతో వివిధ పనులపై వచ్చే వారు ఇబ్బంది పడుతున్నది వాస్తవమే. ప్రస్తుతం కార్యాలయాల నూతన భవనాల నిర్మాణానికి స్థల సేకరణ చేపడుతున్నాం.

– బర్మావత్ శంకర్‌నాయక్, ఎంపీడీఓ

పాత్రికేయుల నిరసన



నర్మెట: నిరసన తెలుపుతున్న పాత్రికేయులు



జఫర్‌గఢ్‌లో..

నర్మెట/జఫర్‌గఢ్/పాలకుర్తి : సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై పోలీసుల దాడిని నిరసిస్తూ పాత్రికేయులు, ప్రజాసంఘాల నాయకులు గురువారం నర్మెట, జఫర్‌గఢ్, పాలకుర్తి మండల కేంద్రాల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేశారు. పత్రికాస్వేచ్ఛను అప్రజాస్వామికంగా అణచివేయడం, దాడులకు పూనుకోవడం, భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని పలువురు వ్యాఖ్యానించారు. ఏపీ పోలీసుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ నిరసన కార్యక్రమానికి పాలకుర్తిలో ప్రజాసంఘాల నాయకులు గుమ్మడిరాజుల సాంబయ్య, దుంపల సంపత్, ఎండీ.అబ్బాస్‌అలీ సంఘీభావం తెలిపారు. కార్యక్రమాల్లో రంగరాజు వెంకట రమణారావు, చిర్ర వెంకట్‌రెడ్డి, మాలోత్ భీంసింగ్, గుర్రాల దయాకర్‌రెడ్డి, ఎండీ.జహీరొద్దీన్, ప్రజ్ఞాపురం సత్యనారాయణ, కొంపెల్లి భాస్కర్, చాడవరపు సిద్దు, బొడికె వినోద్, రాయారపు శేఖర్, ఈరభత్తిని లక్ష్మీనారాయణ, లోనే ఉపేందర్, జ్యోతి రవి, బోనగిరి శ్రవణ్‌కుమార్, బుడిగే సురేష్, నల్లతీగల వెంకన్న, మేరుగు మధు, దాసరి యాకయ్య, చిట్యాల మధు, చిదురాల ఎల్లయ్య, గిరగాని వంశీ, మామిండ్ల సోమయ్య, సలేంద్ర సోమన్న, ముస్కు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

పాలకుర్తి: మండలంలోని మంచుప్పుల గ్రామంలో కురుమలు, యాదవుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గంగమ్మ తల్లి జాతరలో గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట నాయకులు వెంకటరెడ్డి, వెంకన్న తదితరులు ఉన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి జాతరలో పాల్గొని గంగమ్మతల్లికి పూజలు చేపట్టారు. ఆమె వెంట బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు హరిష్, భాస్కర్, మొలుగూరి యాకన్న, మేదారపు సుధాకర్, మాజీ సర్పంచ్ కొండయ్య తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయడంతో పాటు అకాల వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం జనగామ మండలం పెద్దపహాడ్, గోపరాజుపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. నిబంధనల మేరకు తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా తూకం పూర్తి చేసి మిల్లులకు తరలించాలని చెప్పారు. గన్నీ సంచులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యం, రైతుల ఖాతా వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. డిమాండ్‌కు అనుకూలంగా లారీలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. మార్కెటింగ్ సివిల్ సప్లైస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం



జనగామ: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో నిర్వాహకులు



జఫర్‌గఢ్: వాసవిమాతకు పూజలు చేస్తున్న మహిళలు

జనగామ: పట్టణంలోని రైల్వేస్టేషన్ ఏరియా వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు కనులపండువగా జరుగుతున్నాయి. గురువారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై వాసవి కన్యకా పరమేశ్వరి, నగేశ్వరి, సీతారామ చంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను సత్కరించగా, వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజానికి శాంతిని, సౌభాగ్యాన్ని కలిగిస్తాయని అన్నారు. ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ద్వితీయ వార్షికోత్సవ వేడుకలకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, మాజీ కౌన్సిలర్లు తాళ్ల సురేష్‌రెడ్డి, ముస్త్యాల దయాకర్, మల్లిఖార్జున్, పజ్జూరి గోపయ్య, బుద్దా రమేష్, యంసాని శ్రీనివాస్, బిజ్జాల నవీన్, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వాసవిమాతకు పంచామృతాలతో పూజలు

జఫర్‌గఢ్: లోక కల్యాణాన్ని ఆకాంక్షిస్తూ వాసవిమాతకు మహిళలు పంచామృతాలతో విశేష పూజలు నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య భవనంలో వాసవిమాత అమ్మవారికి రెండు రోజు ప్రత్యేక పూజలు చేశారు. పీఠం అధిపతి అనిల్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు వినియోగించుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. గురువారం సముద్రాల, పాంనూర్ గ్రామాల్లో సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ఆర్డీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రెవెన్యూ గ్రామాల్లో ఈనెల 13వ తేదీ వరకు సదస్సులు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తుదారులు తమ సమస్యలను తెలుపుతూ వాటికి సంబంధించిన ఆధారాలను కూడా దరఖాస్తులతో సమర్పించాలని, తద్వారా సమస్యలు సత్వరంగా పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు రశీదులు అందిస్తారని, రైతులు సహకరించాలన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్‌నాయక్, తహసీల్దార్లు, డీటీలు, ఆర్‌ఐలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



జఫర్‌గఢ్‌ వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

జఫర్‌గఢ్: మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇల్లందుల సారయ్య, గద్దం యాకయ్య, శిరబోయిన కవితతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అర్హులను ఎంపిక చేయాలి

చిల్పూరు: ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అర్హులను ఎంపిక చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని బీఆర్‌ఎస్ మండల నాయకుడు రంగు రవి అన్నారు. రాజవరంలో గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారిలో అనర్హులే ఎక్కువ మంది ఉన్నారని, పేదలను ఎంపిక చేయకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం ప్రకటించిన లబ్ధిదారుల లిస్టుపై అధికారులు మరోసారి సర్వేచేసి అర్హులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. నీలశ్రీను, మల్లయ్య, యాకూబ్, ఎడ్ల మహిపాల్ తదితరులు ఉన్నారు.

బచ్చన్నపేట: అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని తెలంగాణ టైలర్స్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ గాలి తిరుపతి అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 10 లక్షల మంది టైలర్లందరికీ ఇందిరమ్మ ఇళ్లు, 50 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికి ఫించన్‌తోపాటు రాజీవ్ యువ వికాస్ పథకం కూడా వర్తింపజేయాలని కోరారు. టైలర్లు పాల్గొన్నారు.

వేసవి శిక్షణను వినియోగించుకోవాలి



జనగామ రూరల్: విద్యార్థులతో కలెక్టర్ రిజ్వాన్ బాషా

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: విద్యార్థులు వేసవి శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. యంగ్ ఇండియా వేసవి శిబిరాలను గురువారం జిల్లా కేంద్రం గణేష్‌వాడ ప్రాథమికోన్నత, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థుల అంతర్గత సామర్థ్యాలను, సృజనాత్మకత, నైపుణ్యాలను గుర్తించి వాటికి పదును పెట్టడమే శిబిరాల లక్ష్యం అని పేర్కొన్నారు. జిల్లాలో 72 ఉన్నత, 9 ప్రాథమికోన్నత పాఠశాలలు, 15 కేజీబీవీల్లో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. 6 నుంచి 17 ఏళ్లలోపు బాల బాలికలకు 25వ తేదీ వరకు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఎంపిక చేసిన పాఠశాల పరిధి ఆవాస ప్రాంత పిల్లలు, ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ భోజన్న, ఎంఈఓ పాల్గొన్నారు.

లింగాలఘణపురం: యంగ్ ఇండియా పేరుతో ప్రభుత్వం విద్యార్థులకు ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ భోజన్న అన్నారు. గురువారం నెల్లుట్ల పాఠశాలలో విద్యార్థుల సమ్మర్ క్యాంపును ప్రారంభించి మాట్లాడారు. హెచ్ఎం శ్రీలత, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ శ్రీలత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. అలాగే నవాబుపేట ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంపును మాజీ ఎంపీటీసీ సిద్దులు ప్రారంభించారు.

నర్మెట: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ మడిపల్లి ఐలయ్య అన్నారు. మండల కేంద్రంతో పాటు, వెల్దండ, హన్మంతాపురం, మచ్చుపహాడ్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన క్యాంపులను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేసవి సెలవులను పురస్కరించుని ఉన్నతాధికారుల సూచనలతో 5 నుంచి 18 సంవత్సరాల విద్యార్థులకు ఐక్యూ, జీకే, ఇండోర్ గేమ్స్‌తో పాటు వివిధ అంశాలపై ఉదయం 8 నుంచి 11 గంటల వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించ బడతాయని, విద్యార్థులు వారి తల్లితండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హెచ్ఎంలు అంజిరెడ్డి, సామ్యూల్ ఆనంద్, యాదగిరి, ఏఏపీసీ చైర్‌పర్సన్ బైరగోని మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిడిగొండలో..

రఘునాథపల్లి: సమ్మర్ క్యాంపులను విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంఈఓ రఘునందన్ అన్నారు. నిడిగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో సమ్మర్‌క్యాంపు ఏర్పాటు చేయగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సుభాష్, నర్సింగరావు, లచ్చిరాం, ఖుద్దూస్, రమేష్ పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులు షురూ..

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల, రాజవరం, మల్కాపూర్, చిల్పూరు, పల్లగుట్ట, శ్రీపతిపల్లి, ఫత్తేపూర్ పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులను ఆయా పాఠశాలల హెచ్ఎంలు ప్రారంభించారు. రాజవరం పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఎంఈఓ దాసరి గోవర్ధన్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి వేసవి శిక్షణా శిబిరాలు

తరిగొప్పుల: పిల్లల మానసికోల్లాసానికి వేసవి శిక్షణా శిబిరాలు ఎంతగానో దోహదపడుతాయని ఎంఈఓ నెల్లుట్ల జానకి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపులు మండల వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ధ్యానం, యోగా, కరాటే, స్పోకెన్ ఇంగ్లీష్,వేదిక్ మ్యాథ్స్, పెయింటింగ్, ఆటల పోటీలు నిర్వహించారు. హెచ్ఎం రవీందర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

బచ్చన్నపేట మండలంలో..

బచ్చన్నపేట: సమ్మర్ క్యాంపులను వినియోగించుకోవాలని మండల విద్యాధికారి ఇర్రి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులను ఆయన ప్రారంభించి మాట్లాడారు.

జఫర్‌గఢ్: కూనూర్, హిమ్మత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలల్లో యంగ్ ఇండియా వేసవి శిక్షణ శిబిరాలను ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఎండీ పర్వేజ్, మంగు జయప్రకాశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిబిరం ఈ నెల 25వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. కాగా, కూనూర్ పాఠశాలలో నిర్వహిస్తున్న బాల్‌బ్యాడ్మింటన్ శిబిరాన్ని హెచ్ఎం ఎండీ పర్వేజ్ పర్యవేక్షించారు. అసోసియేషన్ కోశాధికారి కాటం రాజిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకుర్తి: మండలంలోని ఎనిమిది పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులు ప్రారంభించినట్లు ఎంపీడీఓ రాములు తెలిపారు. మహాత్మాగాంధీ హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు రవీందర్, ఎంఈఓ నర్సయ్య, హెచ్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవరుప్పులలో..

దేవరుప్పుల: విద్యార్థులకు ఆహ్లాదాన్ని జ్ఞానాన్ని అందించేందుకే ప్రభుత్వం పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తుందని ఎంఈఓ జి.కళావతి తెలిపారు. దేవరుప్పుల మండలంలోని పలు గ్రామాల్లోని పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులను ప్రారంభించినట్లు చెప్పారు.

దేవరుప్పుల: రాష్ట్ర విద్యాశాఖ ఆదేశానుసారం పెద్దమడూర్ ఉన్నత పాఠశాలలో యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం అశోక్ తెలిపారు. ఆయన విలేకరులకు క్యాంపునకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

దుర్గామాత బోనాలు



స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామంలో కనకదుర్గ అమ్మవారి మూడవ వార్షికోత్సవ వేడుకలు గురువారంతో ముగిసాయి. ఉత్సవాలలో చివరిరోజున బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం మహిళలు డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో సామూహికంగా వెళ్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. పూజల్లో మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చల్లా ఉమా, ఆలయ ధర్మకర్తలు పండుగ రాజేశ్వర్, పండుగ బుచ్చయ్య, భక్తులు పాల్గొన్నారు.

అన్నదానం

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలిపాక సతీష్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక బస్టాండ్‌లో ప్రయాణికులకు అన్నదానంతోపాటు వాటర్‌బాటిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా స్థానిక బస్టాండ్ వద్ద మహిళా ప్రయాణికులతో మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినాన్ని పురష్కరించుకుని కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం బస్టాండ్ ప్రాంగణంలోని ప్రయాణికులకు భోజనం ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. నాయకులు షేక్ జానీపాషా, మామిండ్ల శ్రీనివాస్, కోరుకొప్పుల మధు, నీల మహేష్, పెసరు సారయ్య, గుర్రం ఫాతికుమార్, ఏలియా, బోసు ఐలయ్య, సృజన్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామానికి చెందిన మారపాక వెంకటయ్య అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. కాగా, విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు. వెంకటయ్య మృతిపట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. నాగరబోయిన యాదగిరి, మారపాక రాములు, ఎల్లస్వామి, ప్రభాకర్, రాజు, శ్రీనివాస్, సంపత్ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

సన్మానం



బచ్చన్నపేట: మండలానికి నూతనంగా వచ్చిన ట్రైనీ ఎస్సై గోవర్ధన్, ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్‌ను బీజేపీ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందజేసి శాలువాతో సన్మానించారు. మండల అధ్యక్షుడు బంగారు మహేష్, జిల్లా అధికార ప్రతినిధి సద్ది సోమిరెడ్డి, నాయకులు కక్కెర్ల గణేష్, దొంతుల చంద్రమౌళి, ఆంజనేయులు, రాంబాబు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

చిల్పూరు: ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించి ఆదుకోవాలని ఆ సంఘం నాయకుడు పోలేపల్లి లింగారెడ్డి కోరారు. ఈ మేరకు మల్కాపూర్ జీపీ ఎదుట గురువారం కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లింగారెడ్డి మాట్లాడుతూ వేతనాలు చెల్లించకుంటే పనులు మానేయాల్సి వస్తుందని అన్నారు. కర్రెల్లి కోమళ, రేణుక, వెంకటస్వామి, కుమార్, ఎల్లయ్య, ఎమాలస్, మల్లేష్, వాటర్‌మెన్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

డ్రెయినేజీలో పడి వ్యక్తి మృతి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన తోట సుందరయ్య(40) ప్రమాదవశాత్తు కల్వర్టుపై నుంచి డ్రెయినేజీ నీటిలో పడి మృతిచెందిన సంఘటన గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుందరయ్య జీవనోపాధి కోసం సూరత్ వెళ్లి దాదాపు ఏడాది క్రితం ఇప్పగూడెంకు వచ్చాడు. తాపీమేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో గురువారం గ్రామంలోని కల్వర్టుపై కూర్చున్న అతడు ప్రమాదవశాత్తు కల్వర్టుపై నుంచి డ్రెయినేజీలో పడ్డాడు. దాంతో అతడి ముఖానికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి అక్క మర్రి ఆండాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

రఘునాథపల్లి: రఘునాథపల్లి-నిడిగొండ మధ్యలో గురువారం ఉదయం గుర్తు తెలియని రైలు కింద పడి అజయ్ (36) ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ హెచ్‌సీ రమణారెడ్డి తెలిపారు. గుంటూరుకు చెందిన అజయ్ జనగామ దయానిలయం సమీపంలోని పెట్రోలు బంక్‌లో పనిచేస్తున్నాడు. మృతుడు గత కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ మనస్థాపంతో రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని బార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకున్నట్లు తెలిపారు.

నియామకం

కొడకండ్ల: రజక సంక్షేమ సంఘం రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కొడకండ్ల మండలం రంగాపురం గ్రామానికి చెందిన రాపోలు రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ముప్పు భిక్షపతి గురువారం రవికుమార్‌కు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తూ సంఘ పటిష్టానికి కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.